# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 180 | విశాఖపట్నం | 1-4-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 180 | VISAKHAPATNAM | 1-4-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram







నేడు లోక్‌సభలో 'అమరావతి చట్టబద్ధత బిల్లు'ను ప్రవేశపెట్టనున్న కేంద్ర హోంశాఖ

## వేసవిలో జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు తప్పవు!







టోల్ ప్లాజాల వద్ద నగదుకు స్వస్తి..

## నేటి నుంచి కొత్త నిబంధన!

### జూలై నాటికి రాష్ట్ర వ్యాప్తంగా

# సంజీవని ప్రాజెక్టు అమలు: చంద్రబాబు

**అమరావతి, పతాకం న్యూస్:** మెరుగైన ప్రజారోగ్యం కోసం అందరూ ఉద్యమంలా కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యాధికారులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రతీ నెల 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్' గ్రామసభలు, హెల్త్ క్యాంపులు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సంజీవని ప్రాజెక్టుపై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సీఎస్ సాయిప్రసాద్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం, నారావారిపల్లెలో సమర్థవంతంగా అమలు అవుతోన్న ఈ ప్రాజెక్టును జూలై కల్లా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు జరపాలనే లక్ష్యాన్ని అధికారులకు సీఎం నిర్దేశించారు. వైద్య పరీక్షల ఫలితాలను వాట్సప్ ద్వారా నేరుగా 48 గంటల్లో వారికి అందించాలని చెప్పారు. అయితే ఇందుకోసం 904 మొబైల్ మెడికల్ యూనిట్స్ అవసరం కానున్నాయని రూ.162 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు వివరించగా అందుకు



సీఎం అంగీకారం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3.14 లక్షల మంది సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ డేటాబేస్‌లో నమోదు చేసుకున్నారని అధికారులు సీఎంకి వివరించారు. వ్యక్తిగత హెల్త్ రికార్డ్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా చూడాలని సీఎం అన్నారు. భవిష్యత్‌లో వైద్య ఖర్చులు తగ్గేలా సేవలు అందించగలగాలని, ప్రివెంటివ్ హెల్త్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. యోగా, న్యూట్రిషన్, మెడిటేషన్, ప్రాణాయామం వంటివి తప్పనిసరిగా అనుసరించడం వల్ల చాలా వరకు ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సంజీవని ప్రాజెక్టు అమలవుతున్న చిత్తూరు జిల్లాలో ప్రజారోగ్యం ఏమేరకు మెరుగయ్యిందో పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు. మాతృత్వ, శక్తి, నైపుణ్యం, క్షేమ, సంజీవని ఈ 5 పిల్లర్లతో త్వరలో 'ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకురావాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు.

### తుంగభద్ర డ్యామ్ గేట్ల పనులను

## పరిశీలించిన పయ్యావుల



**అమరావతి, పతాకం న్యూస్:** : తుంగభద్ర డ్యామ్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గేట్లను మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. తుంగభద్ర డ్యామ్ సైట్ నుంచి సీఎం చంద్రబాబుకు మంత్రి ఫోన్ చేశారు. డ్యాం సైట్ నుంచే కొత్త గేట్లు అమర్చేందుకు జరుగుతున్న పనులను సీఎంకు ఆర్థిక మంత్రి వివరించారు. గేట్ల బిగింపు ప్రక్రియ పూర్తి కావడానికి ఇంకా ఎన్ని రోజుల సమయం పడుతుందని మంత్రి పయ్యావులను


(తరువాయి 2వ పేజీలో)


ఆలయంలో తొక్కిసలాట.. ఎనిమిది మంది మృతి




### రాష్ట్ర ప్రజల శాశ్వత రాజధానిగా అమరావతి: ఎంపీ లావు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రజలకు శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం పార్లమెంట్‌లో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాజధాని రైతులకి మరింత భరోసా వస్తోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులు నమ్మకంతోనే.. రాజధానికి భూములు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను కేంద్రం అర్థం చేసుకుందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం రాజధానిని అడ్డుకోవాలని చూసిందని విమర్శించారు.

### చల్లపల్లి పేలుడు ఘటనపై

## స్పందించిన అనిత




**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన వాహనంలో పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. సీజ్ చేసిన టపాసులను తరలిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఎస్సై సహా నలుగురు పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వివరాలు వెల్లడించారు. గతంలో స్వాధీనం చేసుకున్న టపాసులను స్టేషన్‌కు దూరంగా ఉన్న ఒక షెడ్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు వాటిని నిర్వీర్యం చేయడానికి తీసుకెళ్తుండగా ఈ పేలుడు జరిగినట్లు చెప్పారు. ప్రమాదంలో మొత్తం ఐదుగురు పోలీసు సిబ్బంది గాయపడగా, వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్పీ తెలిపారు. గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం స్థిరంగా ఉందని, ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై అంతర్గతంగా పూర్తిస్థాయి విచారణ చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, చల్లపల్లి పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన పేలుడుపై హోంమంత్రి అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో పేలుడు..

## నలుగురికి తీవ్ర గాయాలు



**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన వాహనంలో పేలుడు సంభవించింది. దీపావళి సందర్భంగా సీజ్ చేసిన టపాసులను తరలిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసు వాహనంలో టపాసులు ఒక్కసారిగా పేలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎస్సై సహా నలుగురు పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## స్పష్టత ఏది?

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు శాసనసభలో తీర్మానించడం స్వాగతించదగినది. ప్రభుత్వం మారితే రాజధానిని మార్చుకోవచ్చన్న తలంపునకు చట్టబద్ధత ముకుతాడు వేస్తుంది. కాగా రాష్ట్ర విభజన జరిగిన పుష్కర కాలం తర్వాత తీర్మానం చేయడం అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఏలికల రాజకీయ దౌర్బల్యాన్ని తెలుపుతుంది. ఇప్పటికి్కూడా 'అమరావతి' తీర్మానంలో సర్కారు స్పష్టత ఇవ్వకుండా మబ్బులో పెట్టడంతో రాష్ట్ర ప్రజలకు, రాజధాని వాసులకు, భూములిచ్చిన రైతులకు సందేహాలు తీరలేదు. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 సెక్షన్ 5, సబ్ సెక్షన్ 2లో 'అమరావతి వద్ద' అని చేర్చాలని, అదే సెక్షన్‌లో వివరణ కింద... మరియు అమరావతి, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సిఆర్‌డిఎ) చట్టం 2014 నోటిఫై చేసిన నగర ప్రాంతాలు కలిగి ఉంటుంది.. అనే పదాలను పొందుపర్చాలని అసెంబ్లీ తీర్మానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. గతంలో టిడిపి ప్రభుత్వం పేర్కొన్న కేపిటల్ సిటీ అంటే 217 చదరపు కిలోమీటర్ల పరిధిలోని తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని 29 గ్రామాలు మాత్రమే. ప్రస్తుత తీర్మానంలో అమరావతి అంటే సిఆర్‌డిఎ లోని ప్రాంతాలుగా పేర్కొన్నారు. ఆరు జిల్లాల్లోని 58 మండలాలు, 8,352 చదరపు కిలోమీటర్లకు విస్తరించిన సువిశాల ప్రదేశం సిఆర్‌డిఎ. మూడు నగర కార్పొరేషన్లు, పది మున్సిపాలిటీలు, వెయ్యికి పైన గ్రామ పంచాయితీల పరిధిలో అమరావతి సరిహద్దులను నిర్ధారించలేదు. గత అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్వకుండా బాహుబలిని మించి డబుల్ బాహుబలి రాజధాని నిర్మాణం గురించి ప్రభుత్వం చెబుతోందని అర్థమవుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్మానం ప్రవేశపెడుతూ.. 2028 ఆగస్టు కల్లా అమరావతిని పూర్తి చేస్తామన్నారు. డెడ్‌లైన్ అయితే విధించారుకాని ఆర్థిక వనరుల గురించి పొడి పొడిగా చెప్పారు. అక్కడి నుంచి ఇక్కడి నుంచి రూ.56 వేల కోట్ల అప్పులొస్తున్నాయని లెక్కలు వల్లించారు. పునర్విభజన చట్టంలో రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిదని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ తీర్మానంలో కేంద్రాన్ని నిధులడగడానికి సాహసించలేకపోయారు. కేవలం రుణాలతోనే రాజధానిని నిర్మిస్తే ఆ భారం ప్రజలపైనే పడుతుంది. అమరావతిని సెల్ఫ్ ఫైనాన్స్ అని ఊదరగొట్టిన టిడిపి ప్రభుత్వం, రూ. వేలు, లక్షల కోట్ల అప్పుల కోసం ఎందుకు వెంపర్లాడుతున్నదో అర్థం కాదు. పన్నెండేళ్ల క్రితం పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు ఇప్పటికీ అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వలేదు. రైతులకు కౌలు, భూములపై ఆధారపడ్డ కార్మికులకు పింఛన్ల పెంపు సహా ఇచ్చిన హామీల అమలుపై తీర్మానంలో ప్రభుత్వం తెలపకుండా, రైతులను త్యాగధనులుగా, భవిష్యత్తు కర్తలుగా పేర్కొనడం ధర్మమా! అసెంబ్లీ తీర్మానంతోనే చట్టబద్ధత రాదు. పన్నెండేళ్లుగా కేంద్రంలో బిజెపినే అధికారంలో ఉంది. రాజధాని లేని రాష్ట్రంగా అరుదైన 'ఖ్యాతి' నెలకొనడానికి కేంద్రమే అసలు కారణం. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని ఆరు మండలాల విలీనం కోసం 2014లో మోడీ ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణ చట్టానికి సవరణ చేసింది. ఆ పని చేస్తేనే తాను సిఎంగా ప్రమాణం చేస్తానన్నట్లు చంద్రబాబు చెప్పుకున్నారు. ఆనాడే అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే సమస్య తలెత్తేది కాదు. తిరిగి అధికారంలోకొచ్చి రెండేళ్లవుతుందనగా, రెండు తడవలు ప్రధాని శంకుస్థాపనలు చేశాక, చట్టబద్ధత గుర్తుకురావడం వింతే! అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిశాక, ప్రోరోగ్ అయ్యాక, ప్రత్యేక అసెంబ్లీకి గురువారం గవర్నర్ నుంచి నోటిఫికేషన్, ఆ మర్నాడు కేబినెట్, ఆ వెంటనే శాసనసభలో తీర్మానం చకచక జరిగిపోవడం వెనుక తదుపరి ల్యాండ్ పూలింగ్‌ల కోసమేనన్న వాదనలకు బలం చేకూరుస్తాయి. ఏప్రిల్ ఒకటిన కేంద్ర కేబినెట్‌కు, 2న పార్లమెంట్‌లో బిల్లు కోసమేనంటున్న కూటమి నాయకుల ముక్తాయింపులు ఆచరణలో తేలుతుంది. శాసన మండలిని సమావేశపర్చకపోవడం వెలితి. వైసిపి ఐదేళ్లూ రాజధానిపై మూడు ముక్కలాడి అనిశ్చితిని కొనసాగించిన మాట నిజం. ఇప్పటికీ ఆ పార్టీ తన వైఖరి నుంచి బయటపడకపోవడం ప్రజల ఆకాంక్షలకు విరుద్ధం. ఇదే సమయంలో వైసిపిని విధ్వంసకారిగా విమర్శిస్తున్న టిడిపి కూటమి నేటికీ అమరావతిపై స్పష్టత ఇవ్వకపోవడం సబబు కాదు.

## నేడు లోక్‌సభలో 'అమరావతి చట్టబద్ధత బిల్లు'ను ప్రవేశపెట్టనున్న కేంద్ర హోంశాఖ



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం దిశగా కీలక అడుగు పడింది. రేపు (బుధవారం) పార్లమెంట్ ముందుకు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు రానునుంది. దీని ద్వారా ఏపీకి అమరావతి ఏకైక రాజధానిగా గుర్తింపు లభించనుంది. ఇందుకు అనుగుణంగా బుధవారం లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2026 బిల్లును కేంద్ర హోంశాఖ ప్రవేశ పెట్టనుంది. దీనిపై ఈ నెల 28న రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. రాష్ట్ర ప్రభుత్వ తీర్మానానికి అనుగుణంగా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం ముందడుగు వేసింది. లోక్?సభ బిజినెస్ జాబితాలో ఈ మేర చట్టసవరణ బిల్లు డ్రాఫ్ట్ అప్లోడ్ చేశారు. లోక్?సభ ఆమోదం తర్వాత రాజ్యసభ ముందుకు ఈ బిల్లు వెళ్లనుంది. ఉభయ సభల ఆమోదం తర్వాత రాజపత్రం (గెజిట్) విడుదల కానుంది. దీంతో అమరావతికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అధికారికంగా గుర్తింపు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టసవరణ బిల్లు లక్ష్యాలు, కారణాలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వివరణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం– 2014లో సెక్షన్ 5 ప్రకారం, నిర్ణీత తేదీ నుంచి 10 ఏళ్లపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు హైదరాబాద్? సంయుక్త రాజధానిగా ఉంటుందని తెలిపారు. ఆ కాలం పూర్తయ్యాక హైదరాబాద్ తెలంగాణ రాజధానిగా కొనసాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పాటవ్వాలని తెలిపారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర పరిశీలన, సంప్రదింపులు, ప్రణాళికల అనంతరం "అమరావతి" ని కొత్త రాజధానిగా గుర్తించి ప్రకటించిందన్నారు. అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఏర్పాటు చేసే లక్ష్యంతో అక్కడ మౌలిక వసతుల అభివృద్ధితోపాటు పలు పరిపాలనా శాసన చర్యలు చేపట్టబడ్డాయన్నారు. 2026 మార్చి 28న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఈ మేర తీర్మానం ఆమోదించిందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్–5ను సవరించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానిగా "అమరావతి" పేరును చేర్చాలని భారత ప్రభుత్వాన్ని కోరిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానానికి అమలు చేస్తూ రాష్ట్ర రాజధాని విషయంలో చట్టబద్ధమైన స్పష్టత ఇవ్వడానికి ఆ చట్టంలోని సెక్షన్ 5లోని ఉపవిభాగం (2)ను సవరించి, "అమరావతి" పేరును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానిగా చేర్చాలని ప్రతిపాదించబడిందని వివరించారు. ఈ మార్పు 2024 జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుందని అమిత్‌షా వెల్లడించారు.

## గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు అరెస్ట్



**నరసారావుపేట, పతాకం న్యూస్:** పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు యువకులను రూరల్ ఎస్.ఐ కిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గ్రామ పరిధిలోని టిడ్కో గృహాల సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు అకస్మాత్తుగా దాడులు నిర్వహించగా గంజాయి విక్రేతల వద్ద నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పట్టుబడిన నిందితులంతా నరసరావుపేట పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారుగా పోలీసులు గుర్తించారు. గంజాయి విక్రయానికి పాల్పడుతున్న ఈ ముఠా వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే దానిపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. ఈ ఘటనతో కేసానుపల్లి ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆలయంలో తొక్కిసలాట.. ఎనిమిది మంది మృతి



**నరసారావుపేట, పతాకం న్యూస్:** బీహార్‌లోని నలంద జిల్లాలో మంగళవారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మగ్రా గ్రామంలోని ప్రసిద్ధ శీతలా దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఎనిమిది మంది మహిళా భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో డజను మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. చైత్ర మాసం చివరి మంగళవారం కావడంతో అమ్మవారి దర్శనం కోసం వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ క్రమంలో ఒక్కసారిగా తోపులాట జరగడంతో భయాందోళన వాతావరణం నెలకొంది. భక్తులు పరుగులు తీయడంతో పలువురు మహిళలు కిందపడిపోయారు. వారిపై నుంచే ఇతరులు వెళ్లడంతో ఊపిరాడక 8 మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటనకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మంగళవారం ఆలయం వద్ద రద్దీ ఉంటుందని తెలిసినా, యంత్రాంగం తగిన భద్రతా ఏర్పాట్లు చేయలేదని ఆరోపిస్తున్నారు. ప్రమాద సమయంలో తగినంత మంది పోలీసులు లేరని, అంబులెన్స్‌లు కూడా ఆలస్యంగా చేరుకున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## మోడీపై విమర్శలు గుప్పించిన రాహుల్ గాంధీ



**కేరళ, పతాకం న్యూస్:** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ–లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

## టోల్ ప్లాజాల వద్ద నగదుకు స్వస్తి.. నేటి నుంచి కొత్త నిబంధన!




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ఇది ఒక ముఖ్యమైన అప్‌డేట్. ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (చీనాూ×) స్పష్టం చేసింది. ఇకపై టోల్ రుసుములను ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ పద్ధతుల్లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై కొత్త నిబంధన అమల్లోకి రానుంది. రహదారుల వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేయాలనే లక్ష్యంతో నగదు రహిత విధానాన్ని అమలు చేస్తున్నారు. టోల్ వసూళ్లలో పారదర్శకతను పెంచడంతో పాటు వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగకుండా వేగంగా వెళ్లేందుకు ఇది దోహదపడుతుంది. దీనివల్ల ఇంధన వినియోగం తగ్గి, కాలుష్యం కూడా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## సంజీవని ప్రాజెక్టు అమలు: చంద్రబాబు

త్వరలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుపైనా సమీక్షించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీలో భాగస్వామి అయ్యేందుకు పలు బీమా సంస్థలు ముందుకు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. పీపీపీ విధానంలో చేపట్టదలచిన మెడికల్ కాలేజీల నిర్మాణంపై చర్చించారు. వైద్యారోగ్య శాఖలో ఎక్కడా ఖాళీలు ఉండకూడదని, రేషనలైజేషన్ ద్వారా ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఫార్మసీ నెట్వర్క్, ల్యాబొరేటరీ ఇంటిగ్రేషన్ జరగాలని అనారోగ్య సమస్యలు, అత్యవసర వైద్య పరిస్థితులు, వైద్య బృందం సూచనల మేరకు మాత్రమే గర్భిణులకు ఇకపై సిజేరియన్లు చేయాలని మిగిలిన సమయంలో నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. 20 శాతానికి మించి సిజేరియన్లు జరిగితే ఆడిటింగ్ చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.

## పరిశీలించిన పయ్యావుల

సీఎం అడిగారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి తుంగభద్ర గేట్ల బిగింపు పనులు పూర్తి కానున్నట్టు మంత్రి చెప్పారు. చొరవతో కర్ణాటక ప్రభుత్వం కూడా త్వరితగతిన పనులు చేపట్టిందని సీఎంకు పయ్యావుల కేశవ్ వివరించారు. గేట్ల బిగింపు పనులు పూర్తైతే కర్నూలు, అనంతపురం జిల్లాకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. సీమ జిల్లాలకు మేలు కలిగేలా తుంగభద్ర గేట్ల బిగింపునకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించినందుకు సీఎంకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ధన్యవాదాలు తెలిపారు.

తుంగభద్ర డ్యామ్ గేట్ కొట్టుకుపోతే కళ్లలో నీళ్లు వచ్చాయని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. డ్యామ్ వద్ద నుంచి మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తే.. రైతుల ప్రయోజనాలు కాపాడాలని ఆదేశించారని తెలిపారు. గేట్లు మొత్తం తుప్పుపట్టాయని.. చేత్తో ముట్టుకుంటే విరిగిపోతున్నాయని అన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడటం కోసం కొత్త గేట్లను అమర్చేందుకు గో ఆల్ అవుట్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళ్లాలని సూచించారన్నారు. తుంగభద్ర డ్యామ్ గేట్లు ఉన్నంత పొడవు దేశంలో మరో ప్రాజెక్టుకు లేవన్నారు. ఒక్క సీజన్‌లో రైతుల ప్రయోజనాల కోసం ఇప్పటికే 18 కొత్త గేట్లు అమర్చామని చెప్పారు. భేషజాలకు పోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు.. కర్ణాటకకు వచ్చి సీఎం సిద్ధరామయ్యతో కాలువ ఆధునీకరణపై చర్చలు జరిపారన్నారు. రైతుల ప్రయోజనాలు శాశ్వతమని.. అందుకే తుంగభద్ర డ్యామ్ గేట్లతో పాటు చైన్‌లను మార్చుతున్నామని చెప్పారు. ఇప్పటికే 18 గేట్లను అమర్చామని.. మొత్తం 33 గేట్లను అమర్చి కాలువ మీద ఉండే రైతులకు నమ్మకం కలిగిస్తామని అన్నారు. అనంతపురం జిల్లా ప్రజల రుణం తీర్చుకోవడానికి అనునిత్యం పని చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన గో ఆల్ అవుట్ స్ఫూర్తితోనే గేట్లను అమర్చగలిగామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.

# ఖాళీ బిందెలతో దళిత మహిళలు ఆందోళన



**రావికమతం, పతాకం న్యూస్:** 'కొళాయిలు నిర్మించారు కానీ మంచినీరు రావడం లేదు' అంటూ ... దళిత కాలనీవాసులు వాపోతున్నారు. మంగళవారం వారంతా ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. అనకాపల్లి జిల్లా రావికతం మండలం కేంద్రానికి అర కిలోమీటర్ దూరంలో దళిత కాలనీ ఉంది. ఈ కాలనీలో 30 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మూడు సంవత్సరాల క్రితం జల జీవన్ మెషిన్ ద్వారా మంచినీటి కోసం ఇంటింటి కుళాయిల నిర్మాణం చేపట్టారు... కానీ ఇంతవరకు కుళాయిలకు నీరు ఇవ్వలేదు.. కొళాయిలు దిష్టిబొమ్మల్లాగా ఇంటి ముందున్నాయే తప్ప నీరు రావడం లేదు. కాలనీలో పిల్లలు మంచినీటి కోసం అల్లాడుతున్నారు. మూడు చేతి బోర్లు ఉన్నాయి. వాటిలో రెండు బోర్లు పనిచేయడం లేదు. రెండు గంటలపాటు బోరును కొడితే గాని నీరు రావడం లేదు. దీనివల్ల వృద్ధులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మంచినీటి కోసం రోజువారి కూలి పనులు కూడా మానుకుంటున్నామంటూ ... కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వెంటనే తమ దళిత కాలనీలో ఉన్న మంచినీటి సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. లేకపోతే మండల అభివృద్ధి కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన నిర్వహిస్తామని వెల్లడించారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం. (కెవి పి ఎస్ వ్యతిరేక పాట కమిటీ ఆధ్వర్యంలో దళిత మహిళలు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలియజేయడం జరిగింది. ఏప్రిల్ నాలుగో తేదీ లోగా మంచినీటి సమస్య పరిష్కారం చేయకపోతే భారీ ఎత్తున ఆందోళన చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే గోవిందరావు. కెవిపిఎస్ నాయకులు సిహెచ్ సూరిబాబు. సిహెచ్ రాజు. సెవెంటి బాల తదితరులు పిలుపునిచ్చారు.

## పంచాయతీలకు ప్రత్యేకాధికారులు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం మరో ముగియనుండడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టింది. ఎన్నికలు జరిగే వరకు పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళతాయి. ఈ మేరకు ఆయా అధికారులతో జాబితాల తయారీలో జిల్లా ప్రభుత్వం యంత్రాంగం తలమునకలైనట్టు సమాచారం. జిల్లాలో మొత్తం 646 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2021 ఫిబ్రవరి రెండు, మూడు వారాల్లో (అప్పట్లో ఉమ్మడి జిల్లా) నాలుగు దశల్లో పంచాయతీల పాలకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. గెలుపొందిన సర్పంచులు, వార్డు సభ్యులు ఏప్రిల్ రెండో తేదీన పదవీ బాధ్యతలు చేపట్టారు. మరో రెండు రోజుల్లో (ఏప్రిల్ రెండో తేదీ) ఐదేళ్ల పదవీ కాలం పూర్తవుతుంది. పంచాయతీల పునర్విభజన, కొత్త పంచాయతీల ఏర్పాటు ప్రక్రియ పూర్తికాలేదు. ఇంకా కుటుంబ సర్వే, బీసీ జనభాగణన, ఇతర కారణాల వల్ల ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణను కొద్ది నెలలపాటు వాయిదా వేసింది. దీంతో ఆయా పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించాలని జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. గజిటెడ్ హోదా కలిగిన అధికారులను గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించాలని పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు మండల అభివృద్ధి అధికారులు మండలాల్లో పనిచేస్తున్న గజిటెడ్ హోదా కలిగిన తహశీల్దారు, ఎంపీడీఓ, ఇతర అధికారులతో జాబితాలను తయారు చేశారు. ఒకవేళ పంచాయతీలకు సరిపడ మండలస్థాయి అధికారులు లేనట్టయితే పంచాయతీస్థాయిలో సీనియర్ అధికారులను నియమించాలని నిర్ణయించారు. ఈ మేరకు వివరాలను సిద్ధం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి సందీప్ ప్రత్యేక అధికారుల జాబితాను సిద్ధం చేసి, ఆమోదం కోసం కలెక్టర్‌కు పంపించారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ జాబితాలను అధికారికంగా విడుదల చేస్తారని సమాచారం. పంచాయతీల పాలకవర్గాలకు ఎన్నికలు జరిగే వరకు, లేదా ఆరు నెలలపాటు (ఏది ముందు అయితే అది వర్తిస్తుంది) ప్రత్యేక అధికారుల పాలన వుంటుంది.

## గిరిజన యువతి ఆత్మహత్య



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** మండల కేంద్రం రామాలయం సమీపంలో ఒక గిరిజన యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ కొరపర్తి గ్రామానికి చెందిన పెంటయ్య, జమ్ములమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె దూసరి లక్ష్మి(22), చిన్న కుమార్తె భవానీ దేవరాపల్లిలో రామాల య సమీపంలోని తెనుగుపూడి రోడ్డులో ఒక అద్దె భవనంలో ఐదేళ్లుగా ఉంటున్నారు. లక్ష్మి ప్రైవేటు మెడికల్ ల్యాబ్‌లో పని చేస్తుండగా, భవానీ సెల్ పాయింట్‌లో పని చేస్తోంది. కాగా సోమవారం రాత్రి తన అక్క ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఫోన్ రావడంతో భవానీ వెంటనే ఇంటికి వెళ్లింది. గదిలో ఫ్యాన్ హుక్‌కు చున్నీతో ఉరివేసుకుని ఉన్న అక్కను చూసి విలపించింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు రావడంతో మృతదేహాన్ని కె.కోటపాడు మార్చురీకి తరలిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు నుండి పడి బాలిక మృతి



**తిరుపతి, పతాకం న్యూస్:** రీల్స్ చేస్తూ .... 13 ఏండ్ల బాలిక అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు నుండి కిందికి పడిపోయి మృతి చెందిన ఘటన మంగళవారం అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజారెడ్డి నగర్, మెడిగో హాస్పిటల్ సమీపంలోని సాయి నివాస్ అపార్ట్‌మెంట్‌లో జరిగింది. నేపాల్ నుండి వలస వచ్చిన ధను బహదూర్ కుటుంబం సాయి నివాస్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసముంటుంది. పుష్ప (13) అనే అమ్మాయి రీల్స్ రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటుందని సమాచారం. అయితే ఈ విషయం తల్లిదండ్రులకు తెలియదు. ఇంటిలో ఉన్న పుష్ప కనిపించకపోవడంతో ఆమె తల్లి కాజల్ వెతుకుతుండగా, అపార్ట్‌మెంట్ ఐదు అంతస్తు నుండి కిందికి పడిపోయినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. తీవ్ర గాయాలతో ఉన్న బాలికను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో అలిపిరి ఎస్ఐ శ్రీవాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు సమస్యలపై వినతులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జివిఎంసి గాజువాక ఆరో జోన్ 71వ వార్డు పరిధిలోని ఆటోనగర్ డి బ్లాక్ తోకాడ గ్రామంలో సర్వే నెంబరు 55/3, 56/2లోగల రోడ్డు సరిహద్దులు గుర్తించి రోడ్డు మార్గానికి సుగమం చేయాలని కోరుతూ కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరికి పలు అపార్టుమెంట్ల వాసులు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను తెలియజేశారు. గాజువాక మండలం తోకాడ గ్రామంలో సర్వే నెంబరు 55/3, 55/2లో ఆటోనగర్ డి బ్లాకు పరిధిలో సమైక్య అపార్ట్‌మెంట్ 95 ఫ్లాట్‌లు, స్వర్ణసాయి రెసిడెన్సీ 50 ఫ్లాట్‌లు, సిరి ఎన్‌క్లేవ్ 20 ఫ్లాట్‌లు, స్వర్ణసాయి ఎన్‌క్లేవ్ 90 ఫ్లాట్‌లు, గ్రీన్‌లైఫ్ అపార్ట్‌మెంట్ ఎ, బి బ్లాకులు 80 ఫ్లాట్లల్లో కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. ఇదే ప్రాంతంలో మరో 50 కుటుంబాల వారూ ఉన్నారన్నారు. వెరసి రెండు వేల మంది జీవిస్తున్నారన్నారు. వారందరూ ఉపయోగించే రోడ్డుకు సరిహద్దులను రెవెన్యూ శాఖ వారు నిర్దేశించినా, ఆక్రమణదారుల గుప్పెట్లో ప్రభుత్వ భూమి (రోడ్డు) ఉందన్నారు. దీనికి సంబంధించి రెవెన్యూ రికార్డుల ప్రకారం సరిహద్దులు గుర్తించి, రోడ్డు మార్గం సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆయా అపార్టుమెంట్ల అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు జె.రామన్న, కెఎస్.చౌదరి, శంకరరావు, గౌరవ్, ఎం.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరాజు, పి.కృష్ణారావు, శివకుమార్, పి.శ్రీనివాసరెడ్డి, శ్రీధరన్, ఆర్.జగన్మోహన్, పిజె.రాముడు, వివిఎల్‌కె.రావు, బి.కోటిరెడ్డి పాల్గొన్నారు. డి బ్లాక్‌లోని పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయడం వల్ల నివాసుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని పై అపార్టుమెంట్ల అసోసియేషన్ నాయకులు వేరొక వినతిపత్రాన్ని జెసికి అందజేశారు. ఇక్కడ నివాసముంటున్న వారంతా రోజువారీ కార్యకలాపాలు, విధులకు, స్కూళ్లు, మార్కెట్లకు, ఇతర పనులకు ఆటో నగర్ డి బ్లాక్ రోడ్డు మార్గం గుండానే ప్రయాణాలు సాగిస్తున్నారని చెప్పారు. అటువంటి ప్రాంతంలో ఎంఆర్ఎఫ్, టాటా స్టీల్ స్ట్రక్చర్, ఇతర ఇండిస్టీలు గొడౌన్స్ నడుపుతూ, వారి కార్యకలాపాలు చేపడుతున్నాయన్నారు. ఈ గొడౌన్స్‌కు వచ్చే భారీ వాహనాల రాకపోకల సమయంలో స్కూలు పిల్లల ఆటోలు, మినీ బస్సులు వచ్చి వెళు ంటాయని తెలిపారు. ఆ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తపరిచారు. ఈ విషయాన్ని గొడౌన్స్ యజమానులు, నిర్వాహకులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టడం లేదన్నారు. ఇలా కమిషనర్ దృష్టికీ సమస్యను తీసుకువెళ్లామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఆటోనగర్ డి బ్లాక్‌కు అన్న క్యాంటీన్ పక్క నుంచి రోడ్డు నిర్మించినట్టయితే అటు పరిశ్రమలతో పాటు ఇటు నివాసులకు ఎటువంటి ఇబ్బందులూ ఉండవని భావిస్తున్నామని నాయకులు తెలిపారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

## ఎట్టకేలకు మెట్టపాలెం రోడ్డుకు మోక్షం



**అనంతగిరి, పతాకం న్యూస్:** ఎట్టకేలకు మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ దాసరితోట నుంచి మెట్టపాలెం పీవీటీజీ గ్రామానికి రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 2024-25 సంవత్సరంలో 4 కిలోమీటర్ల రోడ్డు పనులకు రూ.3.73 కోట్ల పీఎం జన్‌మన్ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ గత ఏడాది డుంబ్రిగుడ పర్యటనకు వచ్చినప్పుడు శంకుస్థాపన చేశారు. అయితే ఈ రోడ్డు మార్గంలోని జీలుగులపాడు సమీపంలో గోస్తనీ నదిపై వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఈ రహదారి పనులు చేపట్టలేదు. కాగా నాలుగు నెలల క్రితం గోస్తనీ నదిపై వంతెన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. అయినా దాసరితోట-మెట్టపాలెం రోడ్డు పనులు ప్రారంభంకాకపోవడం గిరిజనులు నెల రోజులుగా వివిధ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడంతో ఎట్టకేలకు ఉన్నతాధికారులు స్పందించి ఆదివారం ఉదయం రోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం చేపట్టి, వర్షాకాలానికి ముందుగానే రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## యుద్ధం వద్దని శాంతి ప్రదర్శన



**గోపాలపట్నం, పతాకం న్యూస్:** యుద్ధం వద్దు శాంతి నెలకొల్పాలని కోరుతూ జివిఎంసి 89వ వార్డు చంద్రనగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా గోపాలపట్నం డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ, యుద్ధం వల్ల మానవ వినాశనం తప్ప మిగిలేది ఏమీ లేదన్నారు. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు సమస్య నెలకొందని, మన దేశంలో గ్యాస్ సరఫరా తగినంత లేక హోటళ్లు, హాస్టళ్లు, అనేక ప్రైవేట్ సంస్థలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శాంతిని కోరుతూ పావురాలను ఎగరవేశారు. ఖాళీ సిలిండర్లను పెట్టి, గ్యాప్ సరఫరాను వేగవంతం చేయాలని కోరారు. యుద్ధం వద్దంటూ చిన్నారులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు పి.పోలమ్మ, వి.మహాలక్ష్మి, కె.కాంతం, విసిసి సభ్యులు పాల్గొన్నారు. గాజువాక : ఇరాన్ యుద్ధాన్ని వెంటనే ఆపాలని సిపిఎం స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సంత వద్ద సోమవారం నిరసన చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. సందర్భంగా సభ్యులు పి.వెంకయ్య మాట్లాడుతూ, యుద్ధం జరిగితే వచ్చే నష్టాలు మనకు కళ్లకుకట్టినట్లుగా కనిపిస్తున్నాయన్నారు. గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఎగుమతులు ఆగిపోవడంతో బొప్పాయి, ఇతర వ్యాపార పంటల రైతులు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. ఇప్పటికైనా అమెరికా ఇజ్రాయిల్ తమ అహంకారాన్ని వీడి యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.వెంకయ్య, అంకంరెడ్డి శ్రీను, ఆదిరెడ్డి శ్రీను, సిహెచ్.రాముడు, తిరుపతిరావు, మహాలక్ష్మినాయుడు, పాల అప్పలరెడ్డి, సింహాచలం పాల్గొన్నారు. మర్రిపాలెంలోని నరేంద్రనగర్ ప్రాంతంలో విసిసి ఆధ్వర్యంలో యుద్ధం వద్దు శాంతి ముద్దు పేరుతో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తెలుగు రమణ మాట్లాడుతూ యుద్ధం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, రత్నం, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## బీఎన్ రోడ్డుకు మోక్షం ఎప్పుడూ?



**చోడవరం, పతాకం న్యూస్:** ఉమ్మడి విశాఖ జిల్లాలో కీలకమైన భీమిలి-నర్సీపట్నం (బీఎన్ రోడ్డు) అభివృద్ధి, విస్తరణ పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. మార్చిలోగా పనులు పూర్తి చేస్తామంటూ కాంట్రాక్టర్ సుమారు నెలన్నర క్రితం ఇటు కోర్టుకు, అటు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. ఈ గడువు మంగళవారంతో ముగుస్తుంది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడంలేదు. అయితే రోడ్డు నిర్మాణ గడువును ఆరు నెలలకు పెంచుతూ కాంట్రాక్టర్, ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. దీనిపై వాహనదారులు, ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క ఏడాది కూడా నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో జిల్లా రవాణా వ్యవస్థలో కీలకమైన బీఎన్ రోడ్డు దారుణంగా తయారైంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత, రోడ్డు పనులు పూర్తవుతాయని భావించినా, ఏమాత్రం పురోగతి కనిపించడం లేదు. పైగా రహదారి పరిస్థితి మరింత దయనీయంగా మారడంతో వాహనదారులు నానా పాట్లు పడుతున్నారు. ఒక పక్క సీఎం హెచ్చరికలు, మరోవైపు స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు కేసులతో కాంట్రాక్టర్‌పై ఎంత ఒత్తిడి తెచ్చినా, రోడ్డు పనులు పూర్తికాకపోవడం విస్మయానికి గురిచేస్తున్నది.. బీఎన్ రోడ్డు పనులను మార్చి నెలాఖరులోగా పూర్తిచేస్తామంటూ కోర్టుకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిన కాంట్రాక్టర్.. గడువు ముగియడానికి ఒక్క రోజు మాత్రమే గడువు వుండగా.. కనీసం పది శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. బీఎన్ రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్... పనులను వేగంగా చేయలేక పోతుండడంతో ముక్కలుగా విడదీసి సబ్ కాంట్రాక్టర్లకు కేటాయించారు. అయినా సరే పనులు ముందుకు సాగడంలేదు. రోలుగుంట నుంచి బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వరకు పనులు చేయడానికి సబ్ కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నప్పటికీ, అవసరమైన మెటల్ సరఫరా లేకపోవడంతో ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. రోలుగుంట మండలంలో పలు మెటల్ క్వారీలు వివిధ కారణాల వల్ల మూతపడడం, మిగిలిన క్వారీల నుంచి తగినంత మెటల్ లభ్యత లేకపోవడంతో ఈ ప్రభావం బీఎన్ రోడ్డుపై పడింది. ఇక వడ్డాది నుంచి చోడవరం మండలం గౌరీపట్నం వరకు మరో కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. ఇక్కడ కూడా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

## వివాహిత అనుమానాస్పద మృతి



**ఏలూరు, పతాకం న్యూస్:** ఏలూరు టూ టౌన్ పరిధిలో చాణక్యపురి కాలనీలో వివాహిత అనుమానాస్పద మృతి చెందింది. మంగళవారం తెలిపిన సంబంధిత వివరాల ప్రకారం .... ఏలూరు నగరంలోని చాణక్యపురి కాలనీ ఒకటవ రోడ్డు లో గత 15 రోజులు క్రితం భార్యాభర్తలుగా చెప్పుకుంటున్న ఒక జంట ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఈరోజు ఉదయం ఆ జంటలో ఉన్న యువతి అనుమానాస్పద మృతి చెంది. విగతజీవిగా పడి ఉంది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు టూ టౌన్ సీఐ అశోక్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వివరాలు సేకరిస్తున్నారు. అయితే మృతురాలి మెడపై ఉరివేసుకున్న మార్కులు, నోటి నుండి నురగలు ఉన్నాయి. దీంతో పలు అనుమానాలుకు తావిస్తుంది. ఆమెతో పాటు ఉన్న వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.


## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట తెల్లవారు జామున మస్తరు సమయంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఫకీర్రాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సింహాచలం, నాగవంశం శంకర్రావు మాట్లాడుతూ, 60 ఏళ్లకు రిటైర్ అయిన కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలని, చనిపోయిన కార్మికుని కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, 62 ఏళ్లకు రిటైర్మెంట్ వయస్సు పెంచాలని, పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పనిముట్లను, క్యాబ్ ఆటో, ట్రాక్టర్ వాహనాలను మరమ్మతులు చేపట్టి తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.శివ, పి.వరదరాజు, బి.రవి, ఎం.మల్లేష్, జి.తిరుపతిరావు, గంపస్వామి, గంగరాజు, సుజాత, ఇప్పలమ్మ, పాపాలమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. సాలూరు: మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ అధికారం కోసం రాష్ట్రప్రభుత్వం కార్మికులకు హామీలు ఇచ్చి రెండేళ్లయినా నేటికీ ఒక సమస్య పరిష్కరించలేదని విమర్శించారు. మంత్రి సొంత నియోజకవర్గంలో సాలూరులో నేటికీ రెండు నెలల జీతాలు కార్మికులకు చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పిందని, పిఆర్సి ఇచ్చి వేతనాలు పెంచుతామనినేటికీ పిఆర్‌సి ఊసేలేదని అన్నారు. సాలూరు మున్సిపల్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శంకర్, రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించుకుంటే దశలవారీగా ఆందోళనకు సిద్ధపడతామని, ప్రభుత్వం ఇదే వైఖరి కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు వెళ్లే దానికి వెనుకడుగు వేయమని హెచ్చరించారు. అనంతరం వినతి పత్రాన్ని కమిషనర్ నకు అందజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను జిల్లా రాష్ట్ర అధికారుల దృష్టిలో పెట్టి పరిష్కారాన్ని కృషి చేస్తానని కమిషనర్ కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పార్వతి, లక్ష్మి, మధుమోహన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు..పాలకొండ : సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మధ్యాహ్నం మస్తరు సమయంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, పాలకొండ మున్సిపల్ ఫెడరేషన్ కార్యదర్శి సిహెచ్ సంజీవి మాట్లాడుతూ పట్టణ విస్తరణనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వారికి నాలుగు నెలలు, పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న వారికి మూడు నెలలు వేతన బకాయిలు తక్షణమే చెల్లింపునకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 5లోపే వేతనాలు చెల్లించాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతల రఘు, కార్తీక్, భాస్కరరావు, వి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌వేర్ దంపతుల ఆత్మహత్య





**బెంగళూరు, పతాకం న్యూస్:** భర్త గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరి కొన్ని నిమిషాలకే అతడి భార్య కూడా బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణలోని సిద్ధిపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కె.భానుచందర్ రెడ్డి(32), బీబీ షాజియా సిరాజ్(31) వివాహం చేసుకుని బెంగళూరులో నివసిస్తున్నారు. బీబీ షాజియా సిరాజ్ కూడా ప్రముఖ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. భర్త భానుచందర్ రెడ్డి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని ఆత్మహత్మ చేసుకున్నాడు. భార్య ఎంత కొట్టినా తలుపు తెరవ లేదు. దాంతో స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టింది. ఇంతలో గదిలో భర్త భానుచందర్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. అనంతరం బీబీ షాజియా కూడా అపార్ట్‌మెంట్ 17వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. భానుచందర్ రెడ్డి దంపతుల వివరాలను స్థానికులను అడిగి తెలుసుకుంటున్నారు. వారి మరణానికి గల కారణాలు తెలియరాలేదు. అధిక ఒత్తిడి, అనారోగ్యం, మానసిక సమస్యలు తదితర కారణాలేమైనా అయ్యుండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదిక వస్తే తప్ప ఈ దంపతుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని పోలీసులు వివరించారు. మరోవైపు మృతుల తల్లిదండ్రులు ఇప్పటికే బెంగళూరు చేరుకున్నారు. వీరి మృతితో ఇరు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## న్యాయం చేయకుంటే ఐక్యంగా పోరాడుతాం

**నందిగాం, పతాకం న్యూస్:** తమకు న్యాయం చేయకుంటే ఐక్యంగా పోరాడుతామని నందిగాం మండలంలోని గిరిజనులు స్పష్టంచేశారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఎస్టీలను తక్కువచేసి మాట్లాడడం తగదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే ఇచ్చిన వివరణ సంతృప్తిగా లేదని గిరిజన ప్రతినిధులు ఎస్.కోదండరావు, సవర నాగేశ్వరరావు, ఢిల్లేశ్వరరావు, రామ్మూర్తి, అప్పన్నలు పేర్కొన్నారు. ఈమేరకు మండలంలోని సవరబడగాంలో సవరబడగాం, ముకుందాపురం, ఇసంపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులు ఎమ్మెల్యే తమపై చేసిన విమర్శలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ హక్కులను కాలరాయడం సరికాదన్నారు. ఆర్టికల్ 342 ప్రకారం గిరిజనేతరులను గిరిజన జాబితాలో చేర్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదని స్పష్టం చేశారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని తరలించవద్దు



**హిరమండలం, పతాకం న్యూస్:** ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాల యాన్ని మరోచోటుకు తరలించవద్దని హిరమండలం పంచాయతీలోని వ్యాపారులు, స్థానికులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ బాలకృష్ణ, ఎంపీడీవో కాళీ ప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం నూతన భవనం నిర్మాణానికి రూ.1.30 కోట్లు ఇటీవల మంజూరుకావడంతో ఎకరా స్థలం కావాల్సి ఉందని చెప్పారు. స్థానికంగా అంత స్థలం ఎక్కడా లేదని పేర్కొని బ్యారేజీ సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో భవనాలు నిర్మాణం చేపట్టేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఇప్పటికే వంశధార రిజర్వాయర్ నిర్మాణం వల్ల వ్యాపారాలు లేకుండాపోయాయిని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం బ్యారేజీ సెంటర్‌కు తరలిస్తే ప్రస్తుతం జరుగుతున్న వ్యాపా రాలు కూడా పడిపోయి వలసవె ళ్లాల్సి వస్తుందని వాపోయారు. హిరమండలంలో పలు చోట్ల ప్రభుత్వ భూమి ఉందని, అక్కడ తహసీల్దారు కార్యాలయం నిర్మాణం చర్యలు తీసుకోవాలని కోరారు. బ్యారేజీ సెంటర్‌కు తరలిస్తామంటే ఉద్యమ చేపట్టడా నికి వెనుకాడబోమని హెచ్చరించారు.

## ఖైదీల పట్ల వివక్ష తగదు



**విజయనగరం, పతాకం న్యూస్:** ఖైదీల పట్ల సిబ్బంది, తోటి ఖైదీలు వివక్షత చూపరాదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భబిత సూచించారు. విజయనగరం సబ్ జైల్‌ను ఆమె సందర్శించి, తనిఖీ చేపట్టారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల వివక్షత చూపిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం సబ్‌జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. అక్కడి విధులను పర్యవేక్షించారు. జైలులో ఉన్న ఖైదీల వివరాలను ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు ఖైదీలను ఉద్దేశించి జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని, మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. వసతి గృహాలు ఆకస్మిక తనిఖీ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ సోమవారం నగరంలోని కాట వీధి, మంగళవీధిలో గల సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు . వసతి గృహం గదులు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా ఉండేటట్టు చూసుకోవాలని హితవు పలికారు. పిల్లలకు అందుతున్న మెనూ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు మరుగుదొడ్లను పరిశీలించారు వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని హెచ్చరించారు.

## హెల్మెట్ భారం కాదు... బాధ్యత




**పార్వతీపురం, పతాకం న్యూస్:** హెల్మెట్ భారంగా భావించరాదని.. బాధ్యతగా ధరించాలని విశాఖ రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టీ అన్నారు. హెల్మెట్ ధరించాలని కోరుతూ పార్వతీపురంలో అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. పార్వతీపురం ప్రధాన రోడ్డు ద్వారా స్థానిక పాత బస్టాండ్ వరకు మన్యం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో హెల్మెట్ అవగాహన ర్యాలీ" కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి రక్షణ పొందాలని, సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, ప్రజల్లో భద్రతపై అవగాహన కల్పించేందుకు అవగాహన కల్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో సాధించిన ప్రగతిని వివరించారు. హెల్మెట్ పట్ల అవగాహన కోసం మార్పు మీ ద్వార ప్రజల్లోకి బలంగా వెళ్లేలా సహకారం అందించాలని కోరారు. విలేకరులకు హెల్మెట్ అందజేశారు.ఆధునిక హంగులతో పోలీస్ శిక్షణా కేంద్రం అత్యాధునిక సౌకర్యాలతో కొత్తగా ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాన్ని ఐజి గోపీనాథ్ జట్టి ప్రారంభించారు. అనంతరం విలేకర్లుతో ఆయన మాటాడుతూ ఆధునిక సాంకేతికతతో కూడిన శిక్షణ ద్వారా పోలీస్ సిబ్బంది నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయన్నారు. జిల్లా పోలీస్ శాఖకు కేటాయించిన అదునాతన సాంకేతిక పరికరాలు(టూల్స్), బిడి టీం పరికరాలును పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరాలు సాంకేతికతతో కూడుకొని ఉంటున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని చట్టవ్యవస్థను సమర్థంగా నిర్వహించడానికి సాంకేతిక పరిజ్ఞానం, మానసిక దృఢత్వం, శారీరక సామర్థ్యం కీలకం అన్నారు.గంజాయి అక్రమ సాగుపై చేపట్టిన కఠిన చర్యల ఫలితంగా సున్నా సాగు సాధించినట్లు సమావేశంలో వివరించారు. అనంతరం మక్కువ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్పీ మాధవ్ రెడ్డి, అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఎఎస్‌పి మనీషా రెడ్డి, పాలకొండ డిఎస్‌పి రాంబాబు, ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, పట్టణ సిఐ వెంకట్రావు, ఎస్‌బి సిఐ రమణమూర్తి, పలువురు సిఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు సిబ్బంది, ప్రజలు, యువత పాల్గొన్నారు.

## మొక్కజొన్నకు మద్దతు ధర

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఇటీవల తీసు కువెళ్లి మొక్కజొన్నకు మద్దతు ధర కల్పించినట్లు వ్యవసాయశాఖ మంత్రి కింజరా పు అచ్చెన్నాయుడు తెలిపారు. మొక్కజొన్న పంటకు మద్దతు ధర ప్రకటించడంతో కొసమాళ రైతులు నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో అచ్చెన్నాయుడును అభినందించారు. నాలుగేళ్లుగా మొక్కజొన్నపంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టపోయామని రైతులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంజీఆర్ చొరవతో మహేంద్రతనయ ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరుకు కృషిచేసినట్లు తెలిపారు.

## జిల్లాలో 4,286 గృహాలు పంపిణీ



**విజయనగరం, పతాకం న్యూస్:** గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో 4286 ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన -- హౌసింగ్ ఫర్ ఆల్ పథకంలో భాగంగా జిల్లాలో ఈ ఏడాది మార్చి 30 నాటికి పూర్తి చేయాలని నిర్దేశించిన 4,286 గృహాల నిర్మాణాన్ని జిల్లా గృహ నిర్మాణ సంస్థ 100 శాతం పూర్తి చేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను అందజేశారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో మంజూరైన ఇళ్లను, ఆయా ఎమ్మెల్యేలు లోకం నాగ మాధవి, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కిమిడి కళా వెంకటరావు, బేబినాయన, కోళ్ల లలితకుమారి చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, హౌసింగ్ అధికారులు, డివిజన్ హెడ్స్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



**నందిగాం, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ఊరుబడిని కాపాడుకుందామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దతామరాపల్లిలో యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పాఠశాలలో ప్రవేశానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా, తొమ్మిదిమంది తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించడానికి అంగీకరించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 ఎ.చిన్నారావు ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ హైమావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కన్నతండ్రిని కడతేర్చిన కుమారుడు



**కడప, పతాకం న్యూస్:** ఒక బిడ్డ ఎదుగుదలకు తల్లి ఎంత కీలకమో తండ్రి కూడా అంతే కీలకం. అటువంటిది ప్రస్తుత కాలంలో క్షణికావేశంలోనో లేకపోతే ఉద్దేశపూర్వకంగానో రక్తం పంచుకొని పుట్టిన బిడ్డలే వారిని బలి తీసుకుంటున్నారు. తల్లి కడుపులో తొమ్మిది నెలలు మోస్తే, తండ్రి జీవితాంతం తన భుజాలపై మోస్తూ పిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తారు. కానీ నేటి సమాజంలో మధ్యానికి డబ్బులు ఇవ్వలేదనో, బెట్టింగులు వద్దన్నారనో, ఆస్తి కోసమో తల్లిదండ్రులను కడతేరుస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. అటువంటి సంఘటనే ఇది. ఆస్తి కోసం తండ్రిని దారుణంగా హతమార్చిన ఘటన కర్నూలు జిల్లాలో చోటు చేసుకుంది. తనకు దక్కాల్సిన ఆస్తి రాకుండా పోతుందేమోనన్న అనుమానంతో ఏకంగా కన్న తండ్రినే విచక్షణారహితంగా కత్తితో పొడిచి దారుణంగా చంపిన విషాద సంఘటన కర్నూలు జిల్లా కౌతాళం పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంటనహల్ గ్రామంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి, కుంటనహళ్ గ్రామానికి చెందిన నన్నెసాబ్ (47)కు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఇద్దరు మగ, ఒక ఆడ పిల్ల ఉన్నారు. ప్రస్తుతం రెండో భార్య గర్భవతి. నన్నెసాబ్?కి ఉన్న ఆస్తి రెండవ భార్యకే దక్కుతుందనే అనుమానంతో గత కొన్ని రోజుల క్రితం ఆస్తి పంపకాలపై మొదటి భార్య చిన్న కుమారుడు తండ్రిని నిలదీశాడు. పెద్దల పేరుపై ఆస్తి ఉండడంతో అన్నదమ్ములు కలిసి ఆస్తి భాగాలు చేసుకున్న అనంతరం, తండ్రికి చెందిన ఆస్తిలో భాగాన్ని నీ పేరున చేయిస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు. అయినా నూర్ మహమ్మద్ వారి మాటలను పట్టించుకోలేదు. ఎలాగైనా తండ్రిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. అంతే ఆదివారం అర్ధరాత్రి వేళ పథకం ప్రకారం నన్నేసాబ్ నిద్రిస్తున్న సమయంలో నూర్ మహమ్మద్ హత్యకు పాల్పడ్డాడు.

## ఇండియా పోస్ట్ పేరిట ఘరానా మోసాలు




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఇండియా పోస్ట్ 170వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత బహుమతులు అందిస్తోందంటూ సోషల్ మీడియా, వాట్సాప్‌లలో ఒక సందేశం విపరీతంగా వ్యాపిస్తోంది. అయితే ఇది పూర్తిగా నకిలీ అని, సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత సమాచారం దొంగిలించడానికి పన్నిన వల అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సందేశంలో ఉండే లింక్‌ను క్లిక్ చేసి వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తే మోసపోవడం ఖాయమని హెచ్చరించింది. ఈ మోసంపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం ప్రజలను అప్రమత్తం చేసింది. ఇండియా పోస్ట్ ఎలాంటి లక్కీ డ్రాలు గానీ, బహుమతుల పంపిణీ గానీ నిర్వహించడం లేదని, వైరల్ అవుతున్న సందేశం ఒక స్కామ్ అని తేల్చిచెప్పింది. 'ఇండియా పోస్ట్ పేరుతో జరుగుతున్న ఈ లక్కీ డ్రా నకిలీది. ఇలాంటి అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకండి. మీ వ్యక్తిగత వివరాలను పంచుకోకండి' అని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలంటే తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఏదైనా ఆఫర్ లేదా ప్రకటనపై సందేహం ఉంటే, నేరుగా ఇండియా పోస్ట్ అధికారిక వెబ్‌సైట్ లేదా వారి సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించడం ఉత్తమమని వారు చెబుతున్నారు. డిజిటల్ యుగంలో అప్రమత్తంగా ఉండటమే సైబర్ మోసాల నుంచి రక్షణ అని సూచిస్తున్నారు.

## డిప్యూటీ స్పీకర్‌ను తక్షణమే భర్తరఫ్ చేయాలి



**అమలాపురం, పతాకం న్యూస్:** డిప్యూటీ స్పీకర్, ఉండి నియోజకవర్గ ఎంఎల్ఎ కె. రఘురామకృష్ణంరాజును తక్షణమే భర్తరఫ్ చేయాలని దళిత ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ ఆధ్వర్యంలో దళిత ప్రజాసంఘాలు కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బ్యాంకులను మోసం చేసి కాజేసిన వేలాది కోట్లపై విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు, ఆ కేసుల నుంచి మీడియా దృష్టిని మరల్చేందుకు ఎప్పుడు దళితపేటను కన్నెత్తి చూడని రఘురామ కష్ణంరాజు తన అనుచరగణంతో కుట్ర పన్ని ఆకివీడు దళిత పెదపేటను ఎన్నుకున్నారని అన్నారు. సిబిఐ, ఇడి, బ్యాంకు కేసులను మాఫీ చేయించుకోవడానికి కేంద్రంలో ఉన్న బిజెపిని ప్రసన్నం చేసుకోవడానికి అన్నట్లు ఉండి నియోజకవర్గంలో చర్చిలను కూలదోయడం, సొంత పార్టీ శ్రేణుల ఇల్లు కూల్చడం వంటి ఘటనలక పాల్పడ్డారని ఆరోపించారు. పెద్దపేటలో శిథిలావస్తలో ఉన్న గొంతేలమ్మ గుడిని రామాలయంగా మార్చుతానంటూ ప్రశాంతంగా వున్న పల్లెను రావణకాష్టంగా మార్చారని అన్నారు. తన అనుచరగణంతో దాడులు చేయించి అభం శుభం తెలియని 58 మంది దళితులపై అన్యాయంగా కేసులు బనాయించి వారిని రిమాండ్‌కి పంపారని అన్నారు. అమాయక దళితులపై పెట్టిన బూటకపు కేసులను తక్షణం బేషరతుగా ఉపసంహరించుకుని, ఆకివీడు పెదపేట దళితులకు న్యాయం చేయాలని, మత విద్వేషాలు రెచ్చగొడ్తున్న డిప్యూటీ స్పీకర్‌ను తక్షణం భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరావు, దళిత, ఇతర ప్రజాసంఘాల నాయకులు పెయ్యల పరాశరాముడు, జల్లి శ్రీనివాస్, దూరి రాజేష్, ముత్యాల శ్రీనివాస్‌రావు, నక్కా సంపత్, ముత్తాబత్తుల శ్రీనివాస్, మెండి డేవిడ్, సాపే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** మండలంలోని చందలింగి గ్రామ గిరిజనులపైనా, దౌర్జన్యం చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలని, గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని, గిరిజనుల సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. చందలింగిలో గిరిజనులు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములను దురాక్రమణ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని గిరిజనులకు రక్షణ కల్పించాలని, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నా చేశారు. ఈసందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ చందలింగిలో సుమారు వంద గిరిజన కుటుంబాలు జీవిస్తున్నాయని, వీరు తమ తాతదండ్రుల నుంచి సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొంతమంది పెత్తందారులు స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పుకొని సోమవారం గిరిజన భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇది అన్యాయమని, గిరిజనుల సాగు చేస్తున్న భూములకు వెంటనే పట్టాలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చందలింగి రెవెన్యూలో ఉన్న భూములకు సమగ్ర సర్వే జరిపి సాగులో ఉన్న గిరిజనులందరికీ డి పట్టాలు ఇవ్వాలని, గిరిజనుల భూములు దురాక్రమణ చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, గిరిజనులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న కాలంలో గిరిజనులందర్నీ కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం డిటికి వినతిని అందజేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి. రాము, బాధిత గిరిజనులు పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని చేరుకున్న 'ఆపరేషన్ కగార్'.. ముగిసిన మావోయిస్టుల పోరు



**పాడేరు, పతాకం న్యూస్:** దేశంలో మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు ఈ నెల 31తో ముగియనుండగా, అనుకున్న మేర లక్ష్యాన్ని చేరుకుంది. ఎదురుకాల్పుల్లో చాలా మంది మావోయిస్టు అగ్రనేతలు మృతి చెందగా, మరికొందరు క్యాడర్‌తో సహా లొంగిపోయారు. దీంతో సుమారు ఆరు దశాబ్దాలుగా సాగిన విప్లవ పోరు దాదాపు ముగిసింది. దేశంలో మావోయిస్టుల చరిత్రలో ఆంధ్ర, ఒడిశా సరిహద్దుకు ప్రత్యేక స్థానం ఉంది. భౌగోళికంగా ఎత్తైన కొండలు, దట్టమైన అడవులు, తమను ఆదరించే గిరిజనులున్న ప్రాంతం కావడంతో మావోయిస్టులకు ఏవోబీ అడ్డాగా ఉండేది. అందుకే ఇక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహించేవారు. దేశంలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, ఆంధ్రా, తెలంగాణ వంటి ఆరు రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉండేది. దీంతో దీనిని రెడ్ కారిడార్‌గా అటు మావోయిస్టులు, ఇటు పోలీసులు పేర్కొనేవారు. ఈ క్రమంలో దట్టమైన, క్లిష్టమైన అటవీ ప్రాంతమున్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లాల్లో మావోయిస్టు ప్రభావం అధికంగా ఉండడం, రెండు జిల్లాలకు సరిహద్దున ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుండడంతో ఈ నాలుగు రాష్ట్రాల్లో మావోయిస్టుల కార్యకలాపాలు ముమ్మరంగా సాగాయి. దీంతో చత్తీస్‌గఢ్ ప్రధాన కేంద్రంగా ఉన్న మావోయిస్టు పార్టీ ఆంధ్ర, ఒడిశా సరిహద్దు, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో స్పెషల్ జోనల్ కమిటీలను ఏర్పాటు చేసి తమ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసింది. ఇందులో భాగంగా ఆంధ్రా, ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీని ఏర్పాటు చేసి ఇరు రాష్ట్రాలకు సరిహద్దున ఉన్న అటవీ ప్రాంతం (కటాఫ్ ఏరియా)వేదికగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లో మావోయిస్టులు తమ కార్యకలాపాలను ఉధృతం చేశారు. దీంతో దేశంలో ఏవోబీ స్పెషల్ జోనల్ ప్రాంతానికి ఒక ప్రత్యేకత లభించింది. అలాగే అక్కడ మావోయిస్టులున్నారనే సమాచారం తెలిసినప్పటికీ, క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో పోలీసు సాయుధ బలగాలు అక్కడికి చేరుకోలేని పరిస్థితి ఉండేది. దీంతో ఏవోబీలో మావోయిస్టులదే పైచేయిగా ఉండేది. 2008లో ఏవోబీలో మావోయిస్టుల ఏరివేతలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గ్రేహౌండ్స్ బలగాలు ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం నుంచి ఒడిశాలో గాలింపులు చేపట్టి తిరిగి స్లీమర్‌పై వస్తున్న క్రమంలో మావోయిస్టులు జరిపిన దాడిలో 38 మంది గ్రేహౌండ్స్ పోలీసులు హతమయ్యారు. ఇదే క్రమంలో పోలీసుల సాయుధ బలగాల గాలింపులు తగ్గుముఖం పట్టాయి. ఇదే అదనుగా మావోయిస్టులు తమ కార్యకాలపాలను మరింత ఉధృతం చేశారు.

ఏవోబీలో మావోయిస్టుల కార్యకాలాపాలు ఉధృతంగా ఉండడంతో పాటు ఏవోబీలో స్పెషల్ జోనల్ కమిటీ కేంద్రంగా ఒడిశా, ఆంధ్రాలో డివిజన్, ఏరియా కమిటీలు, వాటి కింద లోకల్ గెరిల్లా స్క్వాడ్ పేరిట స్థానిక దళాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఛత్తీస్‌గఢ్ వైపు చూసేందుకు, ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో అడుగు పెట్టేందుకు సైతం పోలీసులు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ప్రారంభించి, మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల మధ్య సయోధ్య, సమన్వయం చేసింది. దీంతో ఆయా రాష్ట్రాల సాయుధ పోలీసు బలగాలు జాయింట్ ఆపరేషన్‌లకు శ్రీకారం చుట్టారు. దీంతో ఛత్తీస్‌గఢ్ మొదలుకొని ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సైతం మావోయిస్టుల ఏరివేతకు గ్రీన్ హంట్‌లో భాగంగా జాయింట్ ఆపరేషన్‌లు కొనసాగించారు. ఈ నేపథ్యంలో నాలుగు రాష్ట్రాల్లోనూ భారీ స్థాయిలో ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు ఉధృతమయ్యాయి. క్రమంగా మావోయిస్టు కార్యకలాపాలపై పోలీసు బలగాలు పట్టు సాధించాయి. దీంతో మావోయిస్టులకు కంచుకోటగా ఉండే ఏవోబీ కటాఫ్ ఏరియాపై దృష్టి సారించారు. మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలో రామ్‌గుడలో అధిక సంఖ్యలో మావోయిస్టులున్నారని సమాచారం అందుకున్న పోలీసులు, 2016 అక్టోబరు 23న ఉదయం జరిపిన కాల్పుల్లో నాలుగు రాష్ట్రాలకు చెందిన 31 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. అది మొదలు క్రమంగా ఏవోబీలో మావోయిస్టుల ఉనికి క్షీణించింది. అయినప్పటికీ 2018 సెప్టెంబరు 23న డుంబ్రిగుడ మండలం లివిటిపుట్టు వద్ద అప్పటి అరకులోయ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమను పట్టపగలు కాల్చి హతమార్చారు. దీంతో పోలీసులు ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను మరింత సీరియస్‌గా తీసుకుని



ఏవోబీలో ఏరివేతను వేగవంతం చేశారు. 2024 నాటికే ఏపీలో అరకొరగా మావోయిస్టులుండగా సరిహద్దున ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి ఇక్కడికి రాకపోకలు సాగిస్తుండేవారు. మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో బలంగా, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో అరకొరగా ఉండే పరిస్థితిని ఆపరేషన్ కగార్ పూర్తిగా కనుమరుగు చేసింది. 2025లో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టుల ఏరివేతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో 2026 మార్చి నెలాఖరుకు మావోయిస్టులుండకూడదనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏరివేతను మరింత వేగవంతం చేసింది. మావోయిస్టులకు కేంద్ర బిందువుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌పై ఫోకస్ పెట్టి భారీ స్థాయిలో సాయుధ బలగాలతో గాలింపులు, కాల్పులతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు, రవాణా వ్యవస్థలను మెరుగుపరిచింది. అలాగే ఆయా ప్రాంతాల్లో అధిక సంఖ్యలో సెల్ టవర్ల నిర్మాణం చేపట్టి మారుమూల పల్లెల్లో సైతం సెల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో అత్యంత మారుమూల ప్రాంతాల్లోని మావోయిస్టుల కదలికలు సైతం క్షణాల్లో సాయుధ పోలీసు బలంగాలకు సమాచారం అందేలా హ్యూమన్ ఇంటెలిజెన్స్ ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పోలీసుల కనుసన్నల నుంచి తప్పించుకోలేని దుస్థితిలో మావోయిస్టులు ఎన్‌కౌంటర్ కావడం లేదా లొంగిపోవడం మినహా మరో దారి కనిపించని పరిస్థితిని పాలకులు కల్పించారు. ఆపరేషన్ కగార్ ఫలితంగా ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో మావోయిస్టులు పూర్తిగా కనుమరుగయ్యారు.

# డిజిటల్ లైబ్రరీల ఏర్పాటులో నిర్లక్ష్యం!

**కాకినాడ, పతాకం న్యూస్:** జిల్లాలో డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలు నిధులు లేక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో వీటిని ప్రారంభించి చేతులు దులుపుకున్నారు. అయితే పూర్తిస్థాయిలో నిధులను విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఆ తర్వాత ప్రభుత్వం కూడా వాటి ఊసెత్తలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా ఈ గ్రంథాలయాల నిర్మాణాల విషయంలో కనీసంగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత సర్కారు ప్రచార ఆర్భాటం కోసం వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పి నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం చేసింది.నాలుగేళ్ళ క్రితం.....గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు సాంకేతికతతో కూడిన సేవలందించేందుకు గత వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల క్రితం 2021 ఆగస్టులో 'వైఎస్ఆర్ విలేజ్ డిజిటల్ గ్రంథాలయాలు' పేరుతో వీటిని ఏర్పాటు చేశారు. 2022 ఉగాది నాటికి మొదటి విడత, అదే ఏడాది డిసంబర్ నాటికి రెండో విడత, 2023 జూన్ నాటికి మూడో విడతలో మొత్తం పూర్తి చేయాలని భావించారు. ఒక్కో గ్రంథాలయానికి రూ.30 లక్షలు నిధులను కేటాయించారు. భవన నిర్మాణానికి రూ.16 లక్షలు, మిగిలిన నిధులతో కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, ఇంటర్ నెట్, కుర్చీలు, ఫ్యాన్లు, పుస్తకాలు, పోటీ పత్రికలు, దినపత్రికలు, కంప్యూటర్లు స్కానర్లు ఏర్పాటు చేయనున్నారు. ఎకరా స్థలంలో ప్రశాంత వాతావరణంలో భవనం ఉండే విధంగా కేటాయించాలని ఉత్తర్వులిచ్చారు. మూడు విడతల్లో అన్ని పంచాయతీల్లో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంగ్రామీణ ప్రాంతాల్లో విద్య, సాంకేతికత, ఉపాధి అవకాశాలను పెంపొందించడమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. గ్రామీణ యువతకు పోటీ పరీక్షల సిద్ధమయ్యేలా సహాయం చేయడం, ప్రతి గ్రామంలో డిజిటల్ విద్యా వనరులు అందుబాటులో ఉంచడం, వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలను గ్రామ స్థాయికి తీసుకురావడం ద్వారా ప్రతి పంచాయతీలో వీటిని అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేశారు. కంప్యూటర్లు, హై-స్పీడ్ ఇంటర్నెట్, ప్రింటర్, స్కానర్, బార్‌కోడ్ సిస్టమ్, పుస్తకాలు, పత్రికలు, మ్యాగజైన్లు చదవడానికి టేబుల్స్, కుర్చీలు, యుపిఎస్, విద్యుత్ సౌకర్యం పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉపయోగపడేలా, పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి డిజిటల్ గ్రంథాలయంలో 50



నుంచి 60 మంది కూర్చునేలా ఆధునిక వసతులు కల్పించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వం వీటిని నిర్మాణానికి నిధులను కేటాయించలేదు.దాంతో అనేకచోట్ల నిర్మాణ పనులు ముందుకు కదలలేదు.119 గ్రంథాలయాలుకాకినాడ జిల్లాలో మూడు విడతల్లో 119 లైబ్రరీల నిర్మాణాలు మొదలు కావాల్సి ఉంది. కానీ రెండు చోట్ల మాత్రమే నిర్మాణాలు మొదలయ్యాయని సమాచారం. కాకినాడ రూరల్ రమణయ్యపేటలో పునాది దశలో, యు.కొత్తపల్లిలో రూఫ్ లెవెల్ లో నిర్మాణం ఆగిపోయినట్టు ఆయా గ్రామాల యువత తెలిపారు. మిగిలిన కొన్నిచోట్ల స్థలాలు గుర్తింపు జరిగినా ఎక్కడా కూడా నిర్మాణాలు ప్రారంభం కాలేదని సమాచారం. దీనిపై పంచాయతీరాజ్ శాఖ అధికారుల వద్ద కూడా వివరాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వమైనా స్పందించి గ్రామస్థాయిలో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని పలువురు నిరుద్యోగ యువత, విద్యార్థులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టి వదిలేసిన నిర్మాణాలను పూర్తి చేసి లైబ్రరీలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## అంబేద్కర్ ఆశయాలను దళితపేటల్లోకి తీసుకెళ్ళాలి



**రాజోలు, పతాకం న్యూస్:** దళిత వాడల్లోకి అంబేద్కర్ విగ్రహలను మాత్రమే కాదని, అంబేద్కర్ ఆశయాలను తీసుకెళ్లాలని ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో నాలుగు మండలాల ఎస్సి సంక్షేమ సంఘాల నూతన కార్యవర్గ సమావేశం సంఘ అధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డు కులాల పురోభివృద్ధికి పార్టీలకు అతీ తంగా కృషి చేస్తానన్నారు. షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘానికి తోడ్పాటు అందిస్తామ న్నారు. సంఘాలను విచ్ఛిన్నం చేసే కుట్రల నుంచి షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఈ సమావేశంలో ఏప్రిల్ 12వ తేదీన మలికిపురంలో నిర్వహించబోయే అంబేద్కర్ జయంతోత్సవ కార్యక్రమ కర పత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నాలుగు మండలాల పరిధిలోని ఎస్సి సర్పంచ్‌లను సత్కరించారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి దేవి, నాలుగు మండలాల సంఘాల అధ్య క్షులు మట్టా సురేష్ కుమార్, గెడ్డం ఫిలిప్ రాజు, గొల్లమందల చిట్టిబాబు, నీతిపూడి మహేష్, సంఘ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాపాక మహేష్, ఉపాధ్యక్షులు ముస్కుడి భాస్కరరావు పాల్గొన్నారు.

## ఆస్తి వివాదంలో వృద్ధుడిపై యాసిడ్ దాడి



**గుంటూరు, పతాకం న్యూస్:** గుంటూరు జిల్లా పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో బంధువుల మధ్య ఆస్తి వివాదం చిలికిచిలికి గాలివానగా మారింది. వివాదం నేపథ్యంలో గ్రామానికి చెందిన కోడూరు శ్రీనివాసరావు (65) అనే వ్యక్తి పై తమ బంధువు మారుపూడి సుబ్బయ్య యాసిడ్ దా డి చేశాడు. దీంతో శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నిందితుడు దాడి చేస్తున్న సమయంలో అడ్డుకోబోయిన ఇద్దరి వ్యక్తులపైనా యాసిడ్ పడడంతో గాయాలపాలైన వారు పొన్నూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిందితుడు సుబ్బయ్య పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, పతాకం న్యూస్:** కె.గంగవరం మండలంలో రూ.1.46 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. కోట గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, దంగేరు గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, అదే గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన రెండు సిసి రోడ్లను మంత్రి ప్రారంభించారు. శివల గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 9 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అమలు చేస్తూ ప్రాధాన్యత క్రమంలో పనులు కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లిడి సుశీల, పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాస్, ఎంపిడిఒ ఎం.శ్రీనివాస్, ఎఇ యేసురత్నం, టిడిపి నాయకులు వాసంశెట్టి సత్యం, ఎఎంసి ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రారు, మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి : యుటిఎఫ్

**కడప, పతాకం న్యూస్:** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 6 నుంచి 15 వరకు కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో నిర్వహించనున్న పదవ తరగతి మూల్యంకన కేంద్రంలో తగు వసతులు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా శాఖ నాయకులు కోరారు. డిఇఒ షంషుద్దీన్‌కు ఆయన ఛాంబర్లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున మూల్యాంకన కేంద్రంలో చలువ పందిర్లు, కూలర్లు, ఫ్యాన్లు తగినన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మంచినీటి వసతితోపాటు, మజ్జిగను కూడా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. మూల్యాంకన విధులకు 58 సంవత్సరాల వయస్సు పైబడిన ఉపాధ్యాయులను, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిని, వికలాంగులు, గర్భిణీలను, చంటి బిడ్డల తల్లులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

## సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికుల ధర్నా



**కోనసీమ, పతాకం న్యూస్:** తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. 17 రోజుల సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాలకు ప్రభుత్వం జిఒ రూపంలో విడుదల చేయాలని, కార్మికుల సంఖ్యను పెంపుదల చేయాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారితోనే వాహనాలు నడపాలని, లైసెన్స్ లేకుండా ఉన్న వ్యక్తితో వాహనాన్ని నడిపించడంతో అది శాంతినగర్లో యాక్సిడెంట్ అయి పడిపోయిందన్నారు. లైసెన్స్ లేనివారిని డ్రైవర్లుగా వాహనాలు ఎక్కిస్తే వారు చేసే ప్రమాదాలకు మున్సిపల్ అధికారులే బాధ్యత వహించవలసి వస్తుందని అన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు టెక్నికల్ వర్కర్లుగా గుర్తించి, తదనుగుణంగా వేతనాలు చెల్లించాలని, మున్సిపల్ కార్మికుల పదవీ విరమణ వయోపరిమితిని 60 నుండి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కార్మికుల కడుపు కొడుతూ పనులు చేయించుకోవడం అన్యాయమని, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూని యన్ నాయకులు బాబురావు, పిల్లి వెంకటరావు, గోరిపర్తి నరసింహారాజు, గుత్తుల తాతారావు, అన్నవరం, భీమశంకర్, ఇతర కార్మికులు పాల్గొన్నారు. అలాగే ముమ్మిడివరం స్థానిక నగర పంచాయతీ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెట్ట శివప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులందరికీ జిఒ నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని, ఐదేళ్లు సర్వీస్ పూర్తయిన మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకలు ఎస్.అజరుకుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎ.సత్తిబాబు, కె.గోవింద్, వి.ప్రసాద్, కె.శరత్, జి.ప్రదీప్, ఎం.భార్గవ్ పాల్గొన్నారు.

# వేసవిలో జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు తప్పవు!



వేసవి కాలంలో ప్రపంచవ్యాప్తంగా వడగాలుల తీవ్రత పెరుగుతోంది. వరుసగా కొన్ని రోజులు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగితే, శరీరం తన అంతర్గత ఉష్ణోగ్రతను సమతుల్యం చేసుకోవడానికి మరింత కష్టపడాల్సి వస్తుంది. దీర్ఘకాలం వేడి ప్రభావానికి గురైతే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. 2025లో వెలువడిన పరిశోధనలు వడగాలులు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ప్రమాదాన్ని చూపిస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తీవ్రమైన పరిస్థితుల్లో మరణాలను 33 శాతం వరకు తగ్గించడానికి ప్రత్యేక చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. వడగాలుల సమయంలో శరీరంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా శరీరం సుమారు 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను నిలుపుకుంటుంది. కానీ వేడి ఎక్కువగా ఉన్నప్పుడు ఈ సమతుల్యతను కాపాడుకోవడం కష్టమవుతుంది. శరీరం చల్లబడటానికి ప్రధానంగా చెమట ద్వారా, చర్మానికి రక్తప్రసరణ పెంచడం ద్వారా పని చేస్తుంది. చెమట గ్రంథులు నీరు, లవణాలు విడుదల చేస్తాయి. ఈ చెమట ఆవిరైపోయే సమయంలో శరీరంలోని వేడి బయటకు వెళ్లిపోతుంది. అలాగే చర్మానికి దగ్గరగా ఉన్న రక్తనాళాలు విస్తరించి ఎక్కువ రక్తాన్ని పంపుతాయి. దీంతో వేడి బయటకు వెళ్ళే ప్రక్రియ వేగవంతమవుతుంది. ఈ రెండు ప్రక్రియలు కలిసి శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి. అయితే ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా ఉన్నప్పుడు లేదా గాలి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ సహజ శీతలీకరణ ప్రక్రియలు సమర్థవంతంగా పనిచేయవు. దీర్ఘకాలం వేడి ప్రభావం వల్ల డీహైడ్రేషన్ ప్రమాదం పెరుగుతుంది. చెమట ద్వారా శరీరం నీటితో పాటు ఎలక్ట్రోలైట్స్‌ను కోల్పోతుంది. తగినంత ద్రవాలు తీసుకోకపోతే అలసట, తల తిరగడం, తలనొప్పి, మూత్రం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన డీహైడ్రేషన్ రక్తపోటు, రక్తప్రసరణపై ప్రభావం చూపి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. శరీరం ఉష్ణోగ్రతను నియంత్రించలేకపోతే హీట్ ఎగ్జాషన్ అనే పరిస్థితి ఏర్పడుతుంది. అధిక చెమట, బలహీనత, వాంతులు, కండరాల నొప్పులు, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ దశలో చర్మం చల్లగా, తడిగా అనిపించినప్పటికీ శరీరం లోపల వేడి ఎక్కువగా ఉంటుంది. సరైన చికిత్స లేకపోతే ఇది మరింత ప్రమాదకర స్థితికి దారితీస్తుంది. వడగాలుల సమయంలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి వడదెబ్బ. ఈ సమయంలో శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌కి పైగా పెరుగుతుంది. గందరగోళం, వేగంగా గుండె కొట్టుకోవడం, పొడిగా వేడిగా ఉండే చర్మం, అపస్మారక స్థితిలోకి వెళ్లడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది అత్యవసర వైద్య పరిస్థితి. దీనికి వెంటనే చికిత్స అవసరం అని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ వల్ల మెదడు, గుండె, కిడ్నీలు వంటి ముఖ్య అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. అధిక వేడి గుండెపై కూడా ఒత్తిడిని పెంచుతుంది. శరీరాన్ని చల్లబరచడానికి గుండె ఎక్కువగా పని చేయాల్సి వస్తుంది. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. అంతేకాకుండా వడదెబ్బ కారణంగా కిడ్నీలు కూడా ప్రభావితమవుతాయి. డీహైడ్రేషన్, రక్తప్రవాహం తగ్గిపోవడం వల్ల కిడ్నీల పనితీరు దెబ్బతింటుంది. రాత్రిపూట అధిక ఉష్ణోగ్రతల వల్ల నిద్రలో అంతరాయం కలుగుతుంది. దీని వల్ల చిరాకు, అలసట, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు వస్తాయి. దీర్ఘకాలిక వేడి మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపి ఒత్తిడి, మూడ్ మార్పులకు కారణమవుతుంది. వడగాలుల కారణంగా ఇలా మొత్తం శరీరం అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని వైద్యులు తెలియజేస్తున్నారు. కనుక వడగాలుల సమయంలో రక్షణ కోసం సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. దాహం లేకపోయినా తరచూ నీరు తాగాలి. తేలికపాటి, సడలించిన దుస్తులు ధరించాలి. మధ్యాహ్నం వేడి ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లడం నివారించాలి. ఫ్యాన్లు, ఏసీ, చల్లని ప్రదేశాలు ఉపయోగించాలి. చల్లని స్నానాలు కూడా శరీరాన్ని చల్లబరుస్తాయి. పిల్లలు, వృద్ధులు, పెంపుడు జంతువులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. వీరు వేడి ప్రభావానికి త్వరగా గురవుతారు. హీట్‌వేవ్‌లు శరీర ఉష్ణోగ్రత నియంత్రణను ప్రభావితం చేసి డీహైడ్రేషన్, హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్ వంటి ప్రమాదాలకు దారితీస్తాయి. కనుక జాగ్రత్తగా ఉండడం చాలా అవసరం. వేడి ప్రభావాన్ని అర్థం చేసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యలను నివారించవచ్చు. తీవ్రమైన వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని వైద్యులు చెబుతున్నారు.

# పశ్చిమాసియా సంక్షోభం.. 5.72 లక్షల మంది భారతీయులు స్వదేశానికి!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడి నుంచి భారతీయులను స్వదేశానికి తరలించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 5.72 లక్షల మంది ప్రయాణికులు పశ్చిమాసియా దేశాల నుంచి సురక్షితంగా భారత్‌కు తిరిగి వచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం ఇవాళ వెల్లడించింది. ఖతార్ గగనతలం పాక్షికంగా తెరుచుకోవడంతో నేడు సుమారు 8 నుంచి 10 ప్రత్యేక వాణిజ్య విమానాలు భారత్‌కు రానున్నాయని తెలిపింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం.. యూఏఈ నుంచి రోజుకు సుమారు 85 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒమన్, సౌదీ అరేబియా నుంచి కూడా భారత్‌కు విమానాలు నడుస్తున్నాయి. అయితే, కువైట్, బ్రహెయిన్ గగనతలాలు ఇంకా మూసివేసే ఉండటంతో ఆ మార్గాల్లో సర్వీసులు నిలిచిపోయాయి. సౌదీ అరేబియాలోని దమ్మామ్ విమానాశ్రయం నుంచి మాత్రం భారత్‌లోని వివిధ నగరాలకు ప్రత్యేక విమానాలు నడుస్తున్నాయి. పలు దేశాల్లో గగనతలాలు మూసివేయడంతో భారతీయుల ప్రయాణానికి ప్రత్యామ్నాయ మార్గాలను సులభతరం చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇరాన్ గగనతలం మూసివేత కారణంగా ప్రయాణికులను ఆర్మేనియా, అజర్‌బైజాన్ మీదుగా తరలిస్తున్నారు. అలాగే, ఇజ్రాయెల్‌లో ఆంక్షల దృష్ట్యా ఈజిప్ట్, జోర్డాన్ ద్వారా.. ఇరాక్ గగనతలం మూసివేతతో జోర్డాన్, సౌదీ అరేబియా ద్వారా భారతీయుల ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడి భారతీయ సమాజంతో అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, వారి భద్రతకు అవసరమైన సహాయం, సూచనలు అందిస్తున్నట్లు ప్రభుత్వం వివరించింది. మరోవైపు సముద్ర జలాల్లోని భారత నావికులందరూ సురక్షితంగా ఉన్నారని పోర్ట్స్, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. గత 24 గంటల్లో భారత పతాక నౌకలపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని తెలిపింది. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 18 భారత నౌకల్లో 485 మంది సిబ్బంది ఉన్నారని, వీరిని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీ షిప్పింగ్) నిశితంగా పర్యవేక్షిస్తోందని పేర్కొంది. కాగా, ఇప్పటివరకు 959 మంది భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి రప్పించగా, గత 24 గంటల్లో 9 మంది తిరిగి వచ్చారు. భారత్‌లోని అన్ని ప్రధాన పోర్టుల కార్యకలాపాలు సాధారణంగా, ఎటువంటి రద్దీ లేకుండా కొనసాగుతున్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## అమెరికాతో చర్చలు లేవు: ఇరాన్



ఇరాన్: అమెరికాతో తాము ఎలాంటి చర్చలు జరపడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో జరుగుతున్న యుద్ధం రెండో నెలలోకి ప్రవేశించిన తరుణంలో, చర్చలు సానుకూలంగా ఉన్నాయంటూ వైట్ హౌస్ చేస్తున్న ప్రకటనలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంప్రదింపులు జరగడం లేదని తేల్చిచెప్పింది. ఈ విషయంపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. గత 31 రోజులుగా అమెరికాతో ఎలాంటి చర్చలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. చర్చల కోసం పాకిస్థాన్ వంటి మధ్యవర్తుల ద్వారా అమెరికా కేవలం కొన్ని ప్రతిపాదనలు పంపిందే తప్ప, అసలు చర్చలే మొదలుకాలేదని వివరించారు. గతంలోని దౌత్యపరమైన చేదు అనుభవాలను, ద్రోహాలను తాము మర్చిపోలేదని, ప్రస్తుతం తమ దృష్టి అంతా దేశ రక్షణపైనే ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే, ఇరాన్ వాదనకు పూర్తి విరుద్ధంగా అమెరికా ప్రకటనలు చేస్తోంది. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, అవి చాలా సానుకూల దిశలో ఉన్నాయని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు. త్వరలోనే ఓ ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం పలుమార్లు పునరుద్ఘాటించారు. ఫిబ్రవరి 28న ఇరాన్ అత్యున్నత నేత అయతుల్లా అలీ ఖమేనీ మరణానంతరం ఈ యుద్ధం ప్రారంభమైంది. వివాదాన్ని ముగించేందుకు ట్రంప్ ప్రతిపాదించిన 15 అంశాల శాంతి ప్రణాళికను ఇరాన్ తిరస్కరించింది. దానికి బదులుగా యుద్ధ నష్టపరిహారం, ఆంక్షల ఎత్తివేత వంటి ఐదు షరతులను విధించింది. ఇరు దేశాల నుంచి వస్తున్న ఈ పరస్పర విరుద్ధ ప్రకటనలతో యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదనే సంకేతాలు వెలువడుతున్నాయి.

చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్‌లో టోల్ వసూల్‌కు ఇరాన్ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదముద్ర వేసింది. దీంతో అధికారికంగా ఇరాన్ ఆ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై ఇక నుంచి టోల్‌ను వసూలు చేయనుంది. ఈ మేరకు హర్మూజ్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.




## వైభవ్ సూర్యవంశీని భారత జట్టులోకి తీసుకోవాలి: మైఖేల్ వాన్



వైభవ్ సూర్యవంశీ.. ప్రస్తుతం చర్చ అంతా ఈ యువ సంచలనం గురించే! కేవలం 14 ఏళ్లకే ఐపీఎల్‌లోకి అడుగుపెట్టి.. సెంచరీతో రికార్డు సృష్టించాడు. ఇటీవలే 15వ పుట్టినరోజు జరుపుకున్న వైభవ్.. గువాహటి వేదికగా సీఎస్కేతో జరిగిన మ్యాచులో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ చేసిన పిన్న వయస్కుడిగా ఘనత సాధించాడు. ఇటీవల అండర్ 19 ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చాడు. ఫైనల్ మ్యాచ్‌లో 175 పరుగులు చేసి ఔరా అనిపించాడు. ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టేందుకు ఉన్న వయసు అడ్డంకి కూడా తొలగిపోయింది. దీంతో జాతీయ జట్టులోకి వైభవ్ సూర్యవంశీని తీసుకోవాలనే డిమాండ్లు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ బీసీసీఐకి ఓ కీలక సూచన చేశాడు. 'వైభవ్ సూర్యవంశీ ఎప్పుడు భారత జట్టులోకి ఎంట్రీ ఇస్తాడా? అని ఎదురుచూస్తున్నా. ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్‌లోనే అతడి గేమ్ ఏంటో చూశాం. రాబోయే కొద్ది నెలల్లో ఇంగ్లండ్ పర్యటనకు భారత్ వెళ్లనుంది. ఒకవేళ నేనే భారత క్రికెట్‌లో ఉండుంటే.. వైభవ్‌కు అవకాశం కల్పించేవాడిని. ఒకేసారి తుది జట్టులో అవకాశం ఇవ్వమని కూడా చెప్పను. అలా ఇచ్చినా పెద్ద నష్టమేం లేదు. కనీసం స్క్వాడ్‌లోకి తీసుకుంటే.. భారత జట్టు డ్రెస్సింగ్ రూమ్ అనుభవమైనా వస్తుంది. రాజస్థాన్ జట్టు మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ అన్ని ఫార్మాట్ల ప్లేయర్. అయితే వైభవ్ వచ్చాక అతడిని సాధారణ ప్లేయర్‌గా మార్చారని నేను అనుకోవడం లేదు. యశస్వి బంతిని చూసి ఆడుతున్నాడు. వైభవ్ మాత్రం తన సహజసిద్ధంగా బంతిని స్టాండ్స్‌లోకి పంపించేందుకే మొగ్గు చూపిస్తున్నాడు. ఇటువైపు యశస్వి ఉండటంతో సూర్యవంశీకి స్వేచ్ఛ లభించినట్లైంది' అని వాన్ వెల్లడించాడు.

## చెన్నైపై రాజస్థాన్ ఘన విజయం..



ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ తమ స్థాయికి తగ్గ ఆటతీరుతో వహ్వా అనిపించాయి. కానీ ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ మాత్రం అత్యంత పేలవ ఆటతీరుతో నిరాశపర్చింది. ఏ విభాగంలోనూ ఆకట్టుకోలేకపోయిన సీఎస్‌కేపై అటు రాజస్థాన్ రాయల్స్ పూర్తి ఆధిపత్యం చూపింది. బౌలర్ల సమష్టి రాణింపునకు తోడు.. చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ (17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 52) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. దీంతో ఈ మ్యాచ్‌లో రియాన్ పరాగ్ సేన 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ముందుగా చెన్నై 19.4 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. ఓవర్టన్ (43), కార్తీక్ శర్మ (18), సర్ఫరాజ్ (17) మాత్రమే రాణించారు. ఆర్చర్, బర్గర్, జడేజాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో రాజస్థాన్ 12.1 ఓవర్లలో 2 వికెట్లకు 128 పరుగులు చేసి నెగ్గింది. జైస్వాల్ (38 నాటౌట్), జురెల్ (18), పరాగ్ (14 నాటౌట్) ఆకట్టుకున్నారు. అన్షుల్‌కు రెండు వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా బర్గర్ నిలిచాడు. చెన్నై బ్యాటర్లు కష్టాలు పడిన చోట 15 ఏళ్ల టీనేజర్ వైభవ్ విధ్వంసకర ఆటతీరును ప్రదర్శించాడు. దీంతో రాజస్థాన్ ఛేదనను తుఫాన్ వేగంతో ఆరంభించింది. ఎదుర్కొన్న తొలి బంతికే క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్న వైభవ్ బౌలర్ ఎవరైనా ఎడాపెడా షాట్లు బాదేస్తూ హోరెత్తించాడు. మరో ఓపెనర్ జైస్వాల్ ఆచితూచి ఆడినా.. వైభవ్ మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగాడు. తొలి ఓవర్‌లో 4,6 రాబట్టిన అతను ఐదో ఓవర్‌లో 4,4,6 బాదాడు. ఇక నూర్ అహ్మద్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో 15 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఈ దూకుడు కారణంగా జట్టు పవర్‌ప్లేలో 74 పరుగులు సాధించడంతో ఫలితం ఖరారైపోయింది. వైభవ్‌ను అన్షుల్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 38 బంతుల్లో 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్ ఉన్నకాసేపు జోరు చూపాడు. అతడిని కూడా అన్షుల్ అవుట్ చేశాక.. జైస్వాల్, కెప్టెన్ పరాగ్ ఎలాంటి ఇబ్బందీ లేకుండా మరో 47 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించారు. మ్యాచ్ ఆరంభానికి ముందు వర్షం కురవడంతో రాజస్థాన్ టాస్ గెలవగానే ఫీల్డింగ్ ఎంచుకుంది. తమ కెప్టెన్ నిర్ణయాన్ని రాయల్స్ బౌలర్లు వమ్ము చేయలేదు. పిచ్ నుంచి తోడ్పాటు లభించడంతో సీఎస్‌కే బ్యాటింగ్ ఆర్డర్‌ను పదునైన బంతులతో వణికించారు. దీంతో టపటపా వికెట్లు కోల్పోయిన చెన్నై.. పరుగుల కోసం చెమటోడ్చింది. చివర్లో ఒవర్టన్ పోరాటం కాస్త పరువు కాపాడింది. ముఖ్యంగా పేసర్లు బర్గర్, ఆర్చర్ కచ్చితమైన బంతులతో ఆరంభంలోనే దెబ్బతీశారు. వారి జోరుకు ఎల్లో జెర్సీలో తొలి మ్యాచ్ ఆడిన ఓపెనర్ సంజూ శాంసన్ (6)కు నిరాశే ఎదురైంది. రెండో ఓవర్‌లోనే సంజూను బర్గర్ బౌల్డ్ చేయగా, తర్వాతి ఓవర్‌లోనే కెప్టెన్ రుతురాజ్ (6)ను ఆర్చర్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఇక, ఆయుష్ మాత్రే (0), షార్ట్ (2) చకచకా పెవిలియన్‌కు చేరడంతో పవర్‌ప్లేలోనే జట్టు 4 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో సర్ఫరాజ్, కార్తీక్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఆత్మవిశ్వాసంతో కనిపించిన సర్ఫరాజ్ రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో ఆకట్టుకున్నాడు. అయితే ఎనిమిదో ఓవర్‌లో జడేజా సీఎస్‌కే వెన్నువిరిచాడు. సర్ఫరాజ్‌తో పాటు హిట్టర్ శివమ్ దూబే (6)ను పెవిలియన్‌కు చేర్చాడు. కాసేపటికే కుదురుకున్న కార్తీక్‌ను పేసర్ బ్రిజేష్ ఎల్బీగా అవుట్ చేయడంతో 74/7 స్కోరుతో చెన్నై కష్టాల్లో పడింది. దీంతో జట్టు స్కోరు వంద దాటడం కష్టమే అనిపించింది. కానీ ఎనిమిదో నెంబర్ బ్యాటర్ ఒవర్టన్ పట్టుదలతో క్రీజులో నిలిచాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా నిలకడగా ఆడాడు. అతడికి అన్షుల్ (7 నాటౌ ట్) నుంచి సహకారం లభించగా.. స్కోరు 120 దాటింది. చివరి వికెట్‌కు ఈ జోడీ అత్యధికంగా 33 రన్స్ అందించడం విశేషం.




# 'పెద్ది' సినిమా విడుదల తేదీపై సందిగ్ధత



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదల తేదీపై నెలకొన్న సందిగ్ధత మరింత ముదురుతోంది. ఏప్రిల్ 30న థియేటర్లలోకి వస్తుందనుకున్న ఈ చిత్రం మరోసారి వాయిదా పడి, జూన్ 26న విడుదల కానుందనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో గందరగోళం కొనసాగుతోంది. తాజాగా ఓ కార్యక్రమంలో నిర్మాత ఎస్‌కేఎన్ చేసిన వ్యాఖ్యలతో ఈ వాయిదా ప్రచారానికి మరింత బలం చేకూరింది. తమ 'చెన్నై లవ్‌స్టోరీ' చిత్రాన్ని జూన్ 26న విడుదల చేయాలనుకున్నామని, కానీ అదే తేదీన 'పెద్ది' వస్తుండటంతో తమ సినిమాను వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతో 'పెద్ది' కొత్త రిలీజ్ డేట్ దాదాపు ఖరారైనట్టేనని పలువురు భావిస్తున్నారు. అయితే, 'పెద్ది' విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తారని కూడా ఆయన చెప్పడం గమనార్హం. ఈ గందరగోళం ఇతర సినిమాల షెడ్యూల్స్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏప్రిల్ 30న 'పెద్ది' వస్తుందని భావించి, అఖిల్ అక్కినేని 'లెనిన్' చిత్రాన్ని జూన్ 26కు మార్చారు. ఇప్పుడు 'పెద్ది' జూన్‌కు వెళుతుందనే వార్తలతో 'లెనిన్' మళ్లీ పాత తేదీకే వస్తుందా అనే చర్చ జరుగుతోంది. మరోవైపు ఏప్రిల్ 30న ధనుష్ 'కర', కన్నడ డబ్బింగ్ చిత్రం 'కేడీ: ది డెవిల్' వంటివి కూడా బరిలో ఉన్నాయి. ఈ మొత్తం అయోమయానికి 'పెద్ది' చిత్ర బృందం అధికారిక ప్రకటనతో ఎప్పుడు తెరదించుతుందోనని సినీ వర్గాలు, అభిమానులు ఎదురుచూస్తున్నారు.

## 10న విడుదల కానున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'



ప్రదీప్ రంగనాథన్ నటిస్తున్న తాజా చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్.జె. సూర్య ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల ఈ సినిమా ఏప్రిల్ 3న రిలీజ్ కాబోతున్నట్లు ప్రకటించారు. అయితే చిత్రబృందం ఇప్పుడు కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. 'థియేటర్లలో ఒక బ్లాక్‌బస్టర్ అనుభూతికి సిద్ధంగా ఉండండి! 'హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్ హీరో' ప్రదీప్ రంగనాథన్ ప్రధాన పాత్రలో... ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం LIK, ఏప్రిల్ 10న థియేటర్లలో సంచలనం సృష్టించడానికి సిద్ధమైంది. శ్రీ పద్మిని సినిమాస్ ఆధ్వర్యంలో తెలుగులో ఘనంగా రిలీజ్ కానుంది' అని తెలిపారు.






## 12 రోజుల్లో రూ.1,390 కోట్లు.. ధురంధర్-2 సరికొత్త రికార్డులు



ధురందర్-2 చిత్రం వసూళ్ల రికార్డును సృష్టిస్తోంది. 12 రోజుల్లోనే రూ.1,390 కోట్ల గ్రాస్ వసూ ళ్లతో టాప్ 4లోకి వచ్చింది. అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చి త్రాల జాబితాలో రూ.2,000 కోట్ల కు పైగా వసూళ్లతో దంగల్ తొలి స్థానంలో, రూ.1,810 కోట్ల వసూళ్లతో బాహుబలి-2 రెండో స్థా నంలో, రూ.1,800 కోట్ల వసూళ్లతో పుష్ప-2 మూడో స్థానంలో నిలిచాయి. ధురంధర్ రూ.1,350 కోట్లతో నాలుగో స్థానంలో ఉండగా, ధురంధర్-2 పన్నెండు రోజుల్లో రూ.1,390 కోట్ల వసూళ్లు సాధించి ఆ చిత్రాన్ని అధిగమించింది. ఈ నెల 19వ తేదీన విడుదలైన ధురంధర్-2 చిత్రం హౌస్ ఫుల్ కలెక్షన్‌లతో దూసుకువెళుతోంది.

ధురంధర్-2 గ్రాస్ కలెక్షన్లు భారతదేశంలో రూ.1,042 కోట్లకు పైగా ఉండగా, ఓవర్సీస్‌లో రూ.350 కోట్లకు పైగా రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా గ్రాస్ కలెక్షన్లు రూ.1,392.23 కోట్లుగా ఉన్నాయి. ఇదిలా ఉండగా, కర్ణాటకలో రూ.100 కోట్లకు పైగా వసూళ్ళు రాబట్టిన తొలి హిందీ సినిమాగా ధురంధర్-2 రికార్డు సృష్టించింది. అంతకుముందు, ధురంధర్ పార్ట్ 1 కేవలం హిందీలోనే విడుదలై రూ.1,350 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**